ప్రజాశక్తి
మంగళవారం 14 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి

ఐద్వా పతాకావిష్కరణ దృశ్యం

అనంత పుర వీధుల్లో ర్యాలీలో పాల్గొన్న నాయకులు, మహిళలు

కదం తొక్కిన మహిళా లోకం

'అనంత'లో భారీ ప్రదర్శన
ఆరంభమైన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ
వేలాదిగా తరలివచ్చిన మహిళలు

మహిళాలోకం కదం తొక్కింది. అనంతపురం నగర వీధుల్లో ఐద్వా జిందాబాద్ నినాదాలు హోరెత్తాయి. ఐద్వా జెండాలను చేతబట్టుకుని వందలాది మంది మహిళలు ముందుకుసాగారు. వారి ముందు ఉరుముల కళాకారుల ప్రదర్శనలు సాగాగా, మహిళలు కోలాటం ఆడుతూ ఉత్సాహంగా ప్రదర్శనలో పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళా ఉద్యమంలో పాల్గొని అమరులైన 13 మంది నాయకుల చిత్రపటాలను చేతబూని ఐద్వా కార్యకర్తలు ముందుకు కదలడం చూపరులను ఆకట్టుకుంది. ఐద్వా రాష్ట్ర 16వ మహాసభలు సోమవారం అనంతపురం నగరంలో ప్రారంభమయ్యాయి. ఈ మహాసభ ప్రారంభానికి ముందు నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఉమ్మడి జిల్లా నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం లలిత కళాపరిషత్ హాలులో బహిరంగ సభ నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సామాజికవేత్త తీస్తా సెతల్వాద్, ఐద్వా జాతీయ అధ్యక్ష,కార్యదర్శులు శ్రీమతి టీచర్, మరియం ధావలే, కోశాధికారి పుణ్యవతి, రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, కోశాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభలో ముఖ్య అతిథి తీస్తా సెతల్వాద్‌తోపాటు ఐద్వా జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి ఎస్.పుణ్యవతి ప్రసంగించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

బహిరంగ సభలో మాట్లాడుతున్న ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

ఉత్సాభరితంగా మహాసభ ప్రారంభం

ఐద్వా రాష్ట్ర 16వ మహాసభ ఉత్సభరిత వాతావరణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆరంభమయ్యాయి. నగరంలోని ఎంకెఎం ఫంక్షన్‌లోని లక్ష్మిసెగల్ ప్రాంగణంలో మొదలయ్యాయి. మహాసభ ప్రారంభానికి ముందు ఐద్వా సీనియర్ నాయకురాలు ఒడ్డుపల్లి నాగమ్మ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రబీయాబి వేదికపై సభ ప్రారంభమైంది. మొదట అమరులైన ఐద్వా నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతులకు సంతాప తీర్మానం అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు పద్మజ జిల్లా చరిత్రతోపాటు మహిళల స్థితిగతులపై ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తెలుగులో అనువాదం చేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని వారి సౌహార్ధ సందేశమిచ్చారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు.

◆ **బిజెపిని ప్రశ్నించలేని స్థితిలో బాబు :** కేంద్రంలో భాగస్వామిగానున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధుల కోసం బిజెపి గట్టిగా ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే విమర్శించారు. ఆహార భద్రతకు, ఉపాధి భద్రత కోసం ఉపాధి హామీ పథకం కింద నిధులు రాబట్టలేకపోతున్నారని పేర్కొన్నారు. కేంద్రానికి సాగిలపడి పనిచేస్తున్నారన్నారు. ఇక్కడ చంద్రబాబు, బీహార్‌లో నితీష్‌కుమార్ మద్దతు లేకపోతే కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉండే అవకాశమే లేదని చెప్పారు. దేశంలో మహిళలపై హింస రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా పశ్చిమబెంగాల్‌లో వైద్య విద్యార్థినిపైనా దాడి జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు మహిళల భద్రతకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

◆ **కేరళ ఆదర్శం :** దేశంలో కేరళ మహిళాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తుందని ఐద్వా జాతీయ అధ్యక్షులు శ్రీమతి టీచర్ చెప్పారు. అక్కడ మహిళ అక్షరాస్యతపై దృష్టి సారించడమే కాకుండా వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టిందన్నారు. అందుకు రుణలివ్వడం ఒక్కటే కాకుండా బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహించడం జరుగుతోందన్నారు. ఈ రాష్ట్రంలో ఐద్వా బలంగా ఉందన్నారు. సుమారు 80 లక్షల మంది సభ్యులున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఐద్వాలో పనిచేయడానికి మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హక్కుల కోసం, సమానత్వం సాధన కోసం సాగే పోరాటంలో భాగస్వామ్యులవ్వాలని పిలుపునిచ్చారు.

◆ **అభ్యుదయం 'అనంత'ం :** అభ్యుదయంలో అనంతపురం జిల్లా అగ్రగామిగా ఉంటుందని ఐద్వా కోశాధికారి ఎస్. పుణ్యవతి పేర్కొన్నారు. 1947లో జరిగిన ఐద్వా తొలి మహాసభలోనే ఈ జిల్లా నుంచి ప్రతినిధులు నలుగురు హాజరయ్యారని గుర్తు చేశారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో యోగి వేమన కదిరి ప్రాంతంలో జన్మించారని తెలిపారు. కడప జిల్లాలో పోతులూరి వీర బ్రహ్మం జన్మించారని పేర్కొన్నారు. ఇటువంటి అభ్యుదయవాదులు పుట్టిన ఈ ప్రాంతమని పేర్కొన్నారు.

◆ **ఐక్య పోరాటాలు అవసరం :** సమాజంలో మహిళలపై వివక్ష దాడులు రూపమాపడం కోసం సమాన హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సౌహార్ధక సందేశం ఇచ్చారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు సమాన హక్కులు లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పుడు అందుతున్న హక్కులు నాడు ఉమ్మడి మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగా సాధ్యమయ్యాయన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడిప్పుడే మహిళలు రాణిస్తున్న నేపథ్యంలో సనాతన ధర్మం పేరుతో మహిళలను వంటింటి కుందేళ్లుగా చేయాలని చూస్తున్నారని తెలిపారు. రాజకీయాలు, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమాన హక్కులు కల్పించినప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు.

◆ **ప్రేమ ఆప్యాయతలకు కొదవ లేదు :** కరువుకు నిలయమైన అనంతపురం జిల్లా ప్రేమ, అప్యాయత, త్యాగాలు, పోరాట పటిమ, కళలకు కొదవ లేదని ఐద్వా మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షురాలు పద్మజ అన్నారు. ఎందరో మహనీయులు అనంతగడ్డలో జన్మించి చరిత్రలో నిలిచారని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ఐద్వా పనిచేయడం అభినందనీయమన్నారు.

శ్రీమతి టీచర్ పుణ్యవతి దుర్గా భవాని పద్మజ

ఐద్వా మహాసభ సందర్భంగా భారీ ర్యాలీ

చిన్నారుల ఐక్యతా నృత్యప్రదర్శన

ఎపిని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిన 'కూటమి'

వైసిపి రణభేరిలో ఆపార్టీ నాయకులు

పెనుకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి విలేకరులు

ఎపిని కూటమి ప్రభుత్వం మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని వైసిపి శ్రీసత్యసాయిజిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ విమర్శించారు. నకిలీ మద్యం అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం పెనుకొండ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదురుగా వైసిపి నాయకులు, కార్యకర్తలతో కలసి నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మద్యం సీసాలను పగలగొట్టారు. 'కల్తీ మద్యం అరికట్టాలి.. కల్తీ మద్యం సీఎం డౌన్ డౌన్, నారా వారి సారా అరికట్టాలి' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మద్యానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందన్నారు. నకిలీ లిక్కర్ వ్యవహారంలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కంకణం కట్టుకున్నారని విమర్శించారు. మద్యం షాపులు, బెల్టు షాపుల్లో నకిలీ మద్యాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు విక్రయిస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారన్నారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో టిడిపి నాయకులు ఏకంగా కల్తీ మద్యం తయారీ ఫ్యాక్టరీయే పెట్టి సప్లై చేస్తున్న ఘటనే రాష్ట్రంలో మద్యం అక్రమాలకు నిదర్శనమన్నారు. పార్టీనాయకులు గడించిన అక్రమ సంపాదనను పైనుంచి కిందివరకూ పంచుకుంటున్నారని ఆరోపించారు. లిక్కర్ సిండికేట్లకు, గ్రామస్థాయి వరకూ విస్తరించిన బెల్టుషాపుల మాఫియాకు, కల్తీ మద్యం వ్యాపారానికి అడ్డురాకూడదనే ఉద్దేశంతోనే ఒక వ్యూహం ప్రకారం ప్రభుత్వ మద్యం దుకాణాలపై విష ప్రచారం చేశారని అన్నారు. ఉద్దేశ పూర్వకంగా వాటిని తీసివేసి, వాటి స్థానంలో సిండికేట్లకు అప్పగించారన్నారు. కల్తీ లిక్కర్ వ్యవహారాలు కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా వెలుగుచూస్తున్నాయని ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లోనూ, ఇప్పుడు రాయలసీమలోనూ ఈ ఘటనలు బయటకు వచ్చాయని అన్నారు. విచారణ, దర్యాప్తు తూతూమంత్రంగానే సాగుతోందని విమర్శించారు. మంత్రి సవిత తన సొంత గ్రామం రాంపురంలో స్వాతంత్రం వచ్చినప్పుడు నుంచి వైన్‌షాప్ లేదని ఈ ప్రభుత్వంలో అక్కడ మద్యం విచ్చలవిడిగా అమ్ముతున్నారని అన్నారు. నకిలీ మద్యం గుట్టు పూర్తిగా తేల్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైన్ షాపులు, పర్మిట్ రూములు, బార్లు బెల్ట్ షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తతంగా తనిఖీలు చేయాలని దీని వెనుక ఎంత పెద్దవారు ఉన్నా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ, కల్తీ మద్యం వల్ల చనిపోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆదుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎక్సైజ్ సిఐ సృజన బాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా నిరసనలు : నకిలీమద్యం విక్రయాలకు నిరసనగా శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా వైసిపి ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగాయి. మడకశిరలో ఆపార్టీ ఇన్‌ఛార్జి ఈరలక్కప్ప ఆధ్వర్యంలో ఎక్సైజ్ పోలీసుస్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, మాజీ సర్పంచ్ కల్లుమర్రి శ్రీరాములు,, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ధర్మవరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట వైసిసి నాయకులు ధర్నా చేపట్టి సిఐకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, గుర్రం శ్రీనివాసులు, కోటిరెడ్డి బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైసిపి హిందూపురం సమన్వయకర్త దీపికా వేణురెడ్డి ఆధ్వర్యంలో ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయం నుండి ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మధుమతి రెడ్డి, అనుబంధ విభాగాల నాయకులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ముందు రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ నివాసం ముందు ఓ రైతు సోమవారం పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. అందుకు సంబందించిన వివరాల మేరకు... హిందూపురం మండలం బాలంపల్లి గ్రామానికి చెందిన బాలాచారి అనే రైతు సోమందేపల్లిలో చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో అతని మగ్గం కాలిపోయింది. మగ్గాలు కాలిపోయిన సమయంలో అప్పటి జాయింట్ కలెక్టర్ హిందూపురం మండలంలోని బాలంపల్లిలో ఒకటిన్నర సెంటు భూమి ఇచ్చాడు. ఈ నేపథ్యంలో కుటుంబపోషణకు అప్పులు ఎక్కువ కావటంతో తనకు ఉన్న వ్యవసాయ భూమిని అమ్ముకున్నాడు. జేసి ఇచ్చిన ఒకటిన్నర సెంటు భూమి మాత్రమే ఉంది. అయితే బాలాచారి ఆ స్థలంలో ఇంటిని నిర్మించాలనుకున్నాడు. అయితే ప్రస్తుతం ఏపీఐఐసీ వారు పరిశ్రమల కోసం భూసేకరణను బాలంపల్లి ఇతర గ్రామాల్లో చేపట్టారు. అందులో భాగంగా బాలాచారికి ప్రభుత్వం ఇచ్చిన ఒకటిన్నర సెంటు భూమి కూడా భూసేకరణలో పోతోంది. దీంతో ఉన్న భూమి సైతం పోతోందని బాలాచారి ఆందోళనకు గురయ్యాడు. తనకు న్యాయం చేయాలని అధికారులను, నాయకులను ఆశ్రయించాడు. ఎలాంటి స్పందన లేకపోవటంతో సోమవారం హిందూపురంలోని బాలకృష్ణ ఇంటి ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. ఇది గమనించిన వెంటనే పోలీసులు అడ్డుకొని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ కు తీసుకొచ్చిన పోలీసులు పెట్రోల్ వాసన వస్తున్నదని అతన్ని బట్టలను విప్పి స్టేషన్ ఆవరణంలో ఎండలో నిలబెట్టారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బాలాచారికి పబ్లిసిటీ పిచ్చి ఉందని అందువల్లే నలుగురి కంట్లో పడాలని ఇలా చేశారని క్షమించి వదిలేయాలి పోలీసులను కోరినట్లు సమాచారం. దీంతో పోలీసులు తమ అదుపులో ఉన్న బాలాచారిని సాయంత్రం ఇంటికి పంపినట్లు తెలుస్తోంది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ బాలాచారి

బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని అభిమానుల నినాదాలు

బాలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలంటూ అభిమానులు ప్ల కార్డుల ప్రదర్శన

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఆయన అభిమానులు శ్రీ సత్య సాయి జిల్లా హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద బాలయ్య కాన్వాయ్ ముందు ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. సోమవారం రూరల్ మండలం కిరికెర పంచాయతీ పరిధిలోని బసవన్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల ప్రారంభం అనంతరం బీటి రోడ్ ప్రారంభానికి వెళ్లే సమయంలో బాలయ్య అభిమానులు ఆయన కాన్వాయ్‌కు అడ్డునిలిచారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ బాలకష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని నినాదాలు చేశారు. ఇది గమనించిన బాలకృష్ణ కారులో నుంచి దిగి అభిమానులకు సర్ది చెప్పారు. ఇది ఇలా ఉండగా సూపర్ జివిస్టి పై పట్టణంలో బాలకృష్ణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రమేష్ కుమార్ తో పాటు అభిమానులు బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలంటూ అంబేద్కర్ సర్కిల్ లో నినాదాలు చేశారు.

చేశారా... చేయించారా...!

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణకు మంత్రి పదవి ఇవ్వాలంటూ నందమూరి బాలకష్ణ అభిమానుల సంఘం జాతీయ కన్వీనర్ సతీష్ కుమార్, మాజీ సర్పంచి రాము, వందలాదిమంది అభిమానులు ప్ల కార్డులు ప్రదర్శించి నిరసన తెలపడాన్ని చూస్తుంటే చేశారా... మంత్రి పదవి కోసం అభిమానులతో చేయించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని ప్రతిపక్షాలు సైతం ప్రస్తావిస్తున్నాయి. మంత్రి పదవి కోసం అభిమానులను ఉసిగొల్పారని వారు ఆరోపిస్తున్నారు. ప్రతిపక్షాలకు తగ్గట్టుగా టిడిపి నేతలు సైతం తమదైన శైలిలో ఎదురుదాడికి దిగారు. పదవులు బాలకృష్ణకు అలంకారం కాదని... పదవులకే బాలకృష్ణ అలంకారం అని అంటున్నారు. ఏది ఏమైనప్పటికీ స్వయానా అభిమానులే బాలకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలంటూ నిరసన తెలపడం పట్టణంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసింది.

నూతన మద్యం డిపోను పరిశీలిస్తున్న డిసి నాగమద్దయ్య

నూతన మద్యం డిపో ప్రారంభం

ప్రజాశక్తి-పెనుకొండ

గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలో బెల్లాలచెరువు రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం డిపోను సోమవారం ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో ఉన్న మద్యం దుకాణాలు, బార్లకు ఈ డిపో నుంచి మద్యం సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, అసిస్టెంట్ డిపో మేనేజర్ బి.నరసింహులు, ఇన్‌స్పెక్టర్ పి.గురునాథ్‌రెడ్డి, ఎస్ఐ బి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన డిఐఒగా సురేష్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా నూతన ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ)గా సురేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈయన సోమవారం డిఎంహెచ్ఒ డా.ఫైరోజ్ బేగంను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇన్‌ఛార్జి జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగేంద్ర నాయక్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌లో పని చేస్తూ ఉద్యోగోన్నతి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అందరి సహాయ సహకారాలతో 'సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని' మరింత సమర్థవంతంగా నిర్వహిస్తామని తెలిపారు.

అర్జీదారులకు న్యాయం చేయండి : ఎస్పీ

పుట్టపర్తి రూరల్ : 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో వచ్చే ఫిర్యాదులు పునరావృతం కాకుండా అర్జీదారులకు సత్వరం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 75 అర్జీలు అందాయి. ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకొన్నారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, ఎస్‌బి సిఐ వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ డైరెక్టర్లకు సన్మానం

నల్లమాడ : టిడిపి నాయకులు డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్వాతి క్లినిక్ ఆవరణలో పుట్టపర్తి మార్కెట్ యార్డ్ నూతన డైరెక్టర్లు ఇ.మణికుమారి, ఎం.జయరాం నాయక్‌లను టిడిపి మండల నాయకులు ఘనంగా సన్మానించారు. నాగభూషణం మాట్లాడుతూ టిడిపిలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ కచ్చితంగా న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ స్వామి, రమణ, భాస్కర్, కేశవరెడ్డి, ఓబుళపతి, రహిమాన్, బయారెడ్డి, జనసేన మండల కన్వీనర్ మహేష్, నరసింహులు, హనుమంతరెడ్డి, నాగరాజు, మహేందర్‌నాయక్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి ఫ్రిజ్ వితరణ

ధర్మవరం రూరల్ : పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి సోమవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మాజీ కార్యదర్శి జయచంద్ర రూ. 18 వేల విలువ చేసే రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. జయచంద్ర మాట్లాడుతూ రోగుల అవసరాల నిమిత్తం ముందుండి కూడా ఆసుపత్రికి మరింత సహాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, రోటరీ క్లబ్ అధ్యక్షులు నాగభూషణ, ఉదయభాస్కర్, హరి, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షులు శివయ్య పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలపై సమావేశం

నంబులపూలకుంట : స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం పంటకోత ప్రయోగాలపై సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు పంటలు సాగు చేసిన భూములను గుర్తించాలని తెలిపారు. బీడు భూములను గుర్తించి నష్టయితే బాధ్యత మీదే వహించాలని తెలిపారు. వేరుశెనగ పంటలో సకాలంలో పంటకోత ప్రయోగాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఒ గంగాధర్, సచివాలయ సిబ్బంది నరసింహారెడ్డి, నారాయణస్వామి, కష్టనాయక్, హరి, పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ

నల్లమాడ : నల్లమాడలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని సోమవారం పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు చెత్త సేకరిస్తూ ప్రతి వీధి, రోడ్డును పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు.

'యశోద' విద్యార్థుల ప్రతిభ

ధర్మవరం రూరల్ : 'హ్యాండ్‌బాల్' పోటీల్లో యశోద పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ అనూష, డైరెక్టర్ రవీంద్ర, పృథ్వీరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14, 17, 19 హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-14లో గిరిచరణ్, మోక్షిత, రాజనాయక్, అండర్-17లో తేజాసాయిరెడ్డి, తన్మయశ్రీ, అండర్-19లో హరిణి, జస్వేద ఎంపికయ్యారన్నారు. వారిని డైరెక్టర్లు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులతో ప్రిన్సిపల్, డైరెక్టర్లు

రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయం:ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు

రైతు సంక్షేమమే సహకార సంఘాల ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తలమర్ల సహకార సంఘం పాలకవర్గ కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేసింది. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ నాబార్డ్ ద్వారా సహకార సంఘాలకు నిధులు నేరుగా అందుతాయని, వాటితో రైతులకు పంట రుణాలు, ఎరువులు మందులు అందించి సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం సహకార సంఘం అధ్యక్షులుగా గోపాల్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా జయచంద్ర, నరసింహులుతో సీఈవో ప్రతాపరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శివప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

సిఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను తలమర్లలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. పుట్టపర్తి మండలంలోని బడే నాయక్‌తండాకు చెందిన పవిత్ర భాయ్‌కి రూ. 1.5లక్షలు, ఎనుములపల్లికి చెందిన జనార్ధనకు రూ. 20 వేలు, అమడగూరు మండలంలోని తుమ్మల గ్రామానికి చెందిన చందనకు రూ. 1.5 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సహకార సంఘం ఛైర్మన్ గోపాల్‌రెడ్డితో ఎమ్మెల్యే, పల్లె

రాచెరువులో ఎమ్మెల్యే గంగపూజ

కొత్తచెరువు రూరల్ : రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తలమర్ల గ్రామంలో పొంగి ప్రవహిస్తున్న రాచెరువు మరువ వద్ద సోమవారం వారు గంగ పూజ చేసి జలహారతి ఇచ్చారు. వారు మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపే బాధ్యత తీసుకుంటామన్నారు. రైతులు పంటలు బాగా పండించి ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సాగు నీటి సంఘం రాష్ట్ర డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీ గ్రేడ్‌ల కుదింపుతో కార్యదర్శులకు మేలు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

5 గ్రేడ్‌ల నుంచి 4 గ్రేడ్‌లుగా పంచాయతీల విభజన చేయడం వల్ల పాలనా సౌలభ్యంతో పాటు కార్యదర్శులకు మేలు కలుగుతుందని రాష్ట్ర మంత్రి ఎస్.సవిత తెలిపారు. పంచాయతీ గ్రేడింగ్‌లను 5 నుంచి 4కు కుదించడంపై సోమవారం పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు మంత్రి సవిత సమక్షంలో పాలాభిషేకం చేశారు. మంత్రి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్ మేరకు సిఎం, డిప్యూటీ సిఎం పంచాయతీలను 4 గ్రేడ్‌లకు కుదించారన్నారు. తద్వారా పాలనా సౌలభ్యంతో పాటు కార్యదర్శులు సకాలంలో ఉద్యోగోన్నతులు పొందే అవకాశం కలుగుతుందన్నారు. పంచాయతీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరేష్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

పరిగి మండలం పి.నరసాపురం పంచాయతీలోని ఎన్.కొత్తపల్లి, ఎన్.ముదిరెడ్డిపల్లి, ఎస్.బీరేపల్లి గ్రామాలకు చెందిన 8 కుటుంబాలు సోమవారం వైసిపిని వీడి మంత్రి సవిత సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి మంత్రి పసుపు కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఓబుళదేవరచెరువు : ఆరోగ్యవంతమైన, బలమైన కుటుంబం, సమాజ నిర్మాణం పౌష్టికాహారంతోనే సాధ్యమవుతుంద ని ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయకుమారి పేర్కొన్నారు. మండలంలోని అల్లాపల్లి పంచాయతీ దాదిరెడ్డి పల్లి అంగన్వాడీ సెంటర్‌లో సోమవారం పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లి గర్భం నుంచే పునాది పడాలన్నారు. తల్లి మంచి పౌష్టికా హారం తీసుకుంటే సంతానం బలంగా, దృఢంగా, ఆరోగ్యవంతంగా జన్మిస్తారన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పౌష్టికాహారంపై ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు షమీం, స్వర్ణమంజుల, పి.సుకన్య, సునంద, ప్రమీల, వెంకట నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను కించపరిస్తే సహించం

పెనుకొండ : గీత కార్మికుల మద్యం దుకాణంపై కక్ష తగదని కల్లుగీత కార్మికుడు ఈడిగ కుమార్ తెలిపారు. మండలంలోని రాంపురంలో ఉన్న మద్యం దుకాణం, మంత్రి సవితపై వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ చేసిన ఆరోపణలను ఖండించారు. ఆయన సోమవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ రాంపురంలో ఉన్న మద్యం దుకాణాన్ని కల్లుగీత కార్మికుల రిజర్వేషన్లలో భాగంగా ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ దుకాణానికి మంత్రికి ఎలాంటి సంబంధం లేదన్నారు. మంత్రిని రాజకీయంగా ఎదుర్కోలేక, ఉనికి కోసం ఏది పడితే అది మాట్లాడొద్దని హితవు పలికారు. ఇంకోసారి కల్లుగీత కార్మికులను కించపరిస్తే సహించే ప్రసక్తే లేదదని హెచ్చరించారు.

విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయుడు

నంబులపూలకుంట : 2025–డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుడిగా ఎన్నికైన శివకుమార్ సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. ఎంఇఒ గోపాల్‌నాయక్ మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించిన మీరు అంకిత భావంతో పిల్లలకు నాణ్యమైన విద్యనందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని సూచించారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి నూతన ఉపాధ్యాయుల కోసం ఎస్‌టియు రూపొందించిన బుక్‌లెట్‌ను ఉపాధ్యాయుడు శివకుమార్‌కు అందజేశారు. సర్వీసులో ఏ అవసరం ఉన్నా ఎస్‌టియు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శివయ్య, సందీప్, వెంకట్రామిరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, రామ్మోహన్, పూర్ణానందరెడ్డి, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

'మెరిట్ లిస్ట్‌లో పేరున్నా ఉద్యోగం ఇవ్వలేదు'

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మెరిట్ లిస్ట్‌లో పేరున్నా ఉన్నతాధికారుల అలసత్వం వల్ల తనకు ఉద్యోగం దక్కలేదని, న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రమైన అమరాపురానికి చెందిన టి.నదియా కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చింది. కలెక్టరేట్ వద్ద ఆమె మాట్లాడుతూ 2024లో కెజిబివిలో నాన్ టీచింగ్ పోస్ట్‌కు దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలకు హాజరవగా మెరిట్ లిస్ట్‌లో కూడా పేరు ఉందన్నారు. కానీ ఉద్యోగం నాకు ఇవ్వకుండా ఇతరులకు ఇచ్చారని వాపోయింది. అలాగే అకౌంటెంట్ ఉద్యోగం కోసం కూడా దరఖాస్తు చేసుకోగా అందులో కూడా అర్హత సాధించినట్లు జాబితాలో పేరు ఉన్నా ఉద్యోగం మాత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఎస్ఎస్ఎ అధికారులు అర్హులను మౌఖిక పరీక్షకు పిలుస్తామని చెప్పి నన్ను పిలవకుండా ఇతరులకు ఉద్యోగాన్ని ఇచ్చారని వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ ఇప్పటికే ఓ మారు కలెక్టర్‌కు అర్జీ ఇచ్చానని, ఇప్పుడు మరోమారు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. ఎస్సీ కోటా కింద నాకు ఉద్యోగం కల్పించి న్యాయం చేయాలని ఆమె కలెక్టర్‌ను వేడుకున్నారు.

వైసిపి క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసిపి రూపొందించిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో వైసిపి శ్రేణులకు ఎదురైన ఇబ్బందులను డిజిటల్ బుక్‌లో నమోదు చేయడం ద్వారా జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారుల అక్రమాలు, అన్యాయాలపై న్యాయపరమైన చర్యలు తీసుకోవడానికి ఈ బుక్ సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి, కులశేఖరరెడ్డి, ఎంపిటిసి రఘునాథ్‌రెడ్డి, సూరి, అభిషేక్‌రెడ్డి, రంగారెడ్డి, దివాకర్‌రెడ్డి, రవి, యుగంధర్, లక్ష్మీపతిరెడ్డి, దామోదర్, రామిరెడ్డి, అశోక్, బాబు, సోము పాల్గొన్నారు.

వైసిపి క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గోడ గడియారం వితరణ

తలుపుల : మండలంలోని ఓబుల్‌రెడ్డి పల్లి గ్రామ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కు సోమవారం రూరల్ డెవలప్మెంట్ ఫ్రెండ్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గోడ గడియారం అందజేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మన్సూర్ మాట్లాడుతూ ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాలకు గోడ గడియారాలు అందించామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ రామ్మోహన్, సిహెచ్ఒ గీత, ఎఎన్ఎం అరుణ, బావాజీ పాల్గొన్నారు.

వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలి

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తిలో వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారుల సమాచార కేంద్రం ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారిని నియమించాలని కోరామని తెలిపారు. స్పందించిన కలెక్టర్ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారన్నారు. త్వరలోనే జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో విజిలెన్స్ కమిటీలు, వినియోగదారుల కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, నారాయణమ్మ, చలపతి, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

తక్కువ సమయంలో ఎక్కువ ఉద్యోగాలిచ్చాం

ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక అతి తక్కువ సమయంలోనే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మెగా డీఎస్సీలో ఎంపికై నియామక పత్రాలు అందుకుని బాధ్యతలు స్వీకరించిన నూతన ఉపాధ్యాయులను సోమవారం ఎమ్మెల్యే పట్టణంలోని వీవర్స్ కాలనీ మున్సిపల్ హైస్కూల్ అభినందించారు. అలాగే ఉపాధ్యాయులకు మిఠాయిలు తినిపించారు. చరిత్రలోనే మెగా డీఎస్సీ ద్వారా అతి తక్కువ రోజుల్లో అతి ఎక్కువ ఉద్యోగాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు చిన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే కందికుంట

మజీద్ నిర్మాణానికి భూమిపూజ

పట్టణ సమీపంలోని కుమ్మరవాండ్లపల్లిలో సోమవారం నూతన మజీద్ నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యాక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా మజీద్ ఏ ఉస్మాన్ ఏ ఘని కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మజీద్ నిర్మాణం పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట టిడిపి మైనార్టీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సత్వరమే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహించామన్నారు.

ఎమ్మెల్యేకు నాయీ బ్రాహ్మణుల వినతి

నాయీ బ్రాహ్మణుల కులదైవం వైద్య నారాయణ భగవాన్ శ్రీధన్వంతరి జయంతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించి, జీవో ఇవ్వాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ ధన్వంతరి జయంతి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారిలో నాయీ బ్రాహ్మణ కళాకారుల సంఘం అధ్యక్షులు జి.ఈశ్వర య్య, సేవా సంఘం అధ్యక్షులు టి.రమణ, ప్రసాద్, హరిప్రసాద్, శ్రీరాములు, కృష్ణ, శివకుమార్, మునికుమార్, లోకేష్, నరేష్, వెంకటరమణ ఉన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని సున్నంపల్లి పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు తక్షణమే వేతనాలు మంజూరు చేయాలని సిఐటియు మండల నాయకులు వివి.రమణ, సిపిఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ శివప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్మికులకు 12 నెలలుగా వేతనాలు అందలేదన్నారు. దీంతో వారికి కుటుంబాల పోషణ కూడా భారమైందన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వారిని బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు నెల నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, రమణప్ప, పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చేనేతలకు ఉచిత విద్యుత్ అమలు చేయాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, నేతన్న భరోసా కింద రూ. 25వేలను తక్షణమే అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చారు. చేనేత నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు చేనేత కార్మికులకు హామీ ఇచ్చి 2 నెలలైనా ఇంతవరకు ఆయా పథకాలకు సంబంధించి విధి విధానాలను ప్రభుత్వం విడుదల చేయలేదన్నారు. ఇకనైనా ఉచిత విద్యుత్, నేతన్న భరోసా పథకాలను వెంటనే అమలు చేయడంతో పాటు చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. స్పందించిన ఆర్డీవో చేనేతల సమస్యలను ప్రభుత్వం, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెంకటస్వామి, చేనేత కార్మిక సంఘం నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు, ఆదినారాయణ, శ్రీనివాసులు, శివ, బాలరంగయ్య, రాజ, కేశవ పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్ అందజేత

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మున్సిపాలిటీలోని వివిధ పాఠశాలల్లో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు సోమవారం పట్టణంలోని గణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్(సర్వీస్ రిజిస్టర్లు), యుటిఎఫ్ బ్యాగులను రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రామకృష్ణానాయక్ అందజేశారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ లక్షకు పైగా సభ్యత్వం కలిగిన అతిపెద్ద ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ అన్నారు. విద్య, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నామన్నారు. నూతన ఉపాధ్యాయులు యుటిఎఫ్‌లో చేరి సంఘాన్ని బలపరచాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయపరమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, డా. రామకృష్ణ, రాంప్రసాద్, సాయిగణేష్, రామాంజనేయులు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్ అందజేసిన యుటిఎఫ్ నేతలు

విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ

సోమందేపల్లి : స్థానిక జడ్పీ హైస్కూల్, పాపిరెడ్డిపల్లి కెజిబివిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం టిడిపి నాయకులు ఉచితంగా స్కూల్ డైరీలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ మంత్రి సవిత ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ డైరీలను అందజేసిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సగర ఉప్పర కార్పొరేషన్ ఛైర్మన్ రంగేపల్లి వెంకటరమణ, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, ఎంపిడిఒ వెంకటలక్ష్మమ్మ, ఎంఇఒ ఆంజనేయులు, ఇన్‌ఛార్జి హెచ్ఎం రామాంజినేయులు, కెజిబివి ఎస్ఒ అనిత, టిడిపి మండల కన్వీనర్ వెంకటేష్, నాయకులు రామకృష్ణ, సంజీవ్‌రెడ్డి, భానుకీర్తిస్వామి, సురేష్, బాబయ్య, మహేంద్ర, ఆకుల రమణ, మద్దిలేటి, జనసేన నాగరాజు, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన

తలుపుల: స్థానిక ఏడుకొండలు ఫంక్షన్ హాలులో సోమవారం సే ట్రీస్, అనుబంధ సంస్థ గ్రీన్ ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు పర్యావరణ పరిరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కాలు ష్యాన్ని నివారించాలంటే మొక్కలు విరివిగా నాటి సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ అరుణ్ కుమార్, సాయిచరణ్, గ్రీన్ ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మేడ చెన్నకృష్ణ తెలిపారు. ఆగ్రోస్ ఫారెస్ట్ ద్వారా అడవిలో మొక్కలు నాటడం వల్ల కాలుష్యం తగ్గుతుందన్నారు. ప్రతి రైతు తమ పొలంలో మొక్కలు నాటడం వల్ల వారి జీవనోపాధి పెరుగుతుందన్నారు. 90 శాతం సబ్సిడీతో మొక్కలు అందజేస్తామని, రైతులు గ్రీన్ ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ చెన్నకృష్ణ 7893271356ను సంప్రదించాలన్నారు.

బెల్ట్ షాపులు తొలగించాలని వినతి

ఓబుళదేవరచెరువు : జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుందని, వెంటనే మద్యం బెల్టు షాపులను తొలగించాలని ఆర్‌సిపి నియోజకవర్గ కార్యదర్శి మున్నా, రైతు సంఘం నాయకులు రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం నకిలీ మద్యాన్ని అరికట్టి, బెల్ట్ షాపులను నియంత్రించాలని, లేనిచో మహిళలతో కలిసి గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు శివమ్మ , శ్రీనివాసులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి

గోరంట్ల : విజయనగర సామ్రాజ్య మహారాజు శ్రీకృష్ణదేవరాయలు జయంతి, వర్ధంతి, పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ సోమవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ మారుతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హస్తకళల రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్, సంతోష్, వేణు రాయల్, బాలాజీ, కిషోర్, నరేంద్ర, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ కార్యాలయ ఉద్యోగిపై ఫిర్యాదు

పుట్టపర్తి అర్బన్ : జిల్లా ఐసిడిఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌లో వినతి పత్రం ఇచ్చారు. ఎఐఎస్‌బి జిల్లా కార్యదర్శి పోతులయ్య, పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి ఎన్నో ఏళ్లుగా ఆ సీటులోపాతుకుపోయి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వన్ స్టాప్ సెంటర్ల నియమకాల్లో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి రూ. లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయన్నారు. చిన్నపిల్లలకు నాసిరకం సరుకులు అందిస్తున్నారన్నారు. మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, అనిల్, కేశవ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన నూతన జెసి మౌర్య భరద్వాజ్

బాధ్యతలు చేపట్టిన జెసి మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నూతన జాయింట్ కలెక్టర్‌గా సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మౌర్య భరద్వాజ్ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. జెసికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. జెసి మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో వారి సూచనలు, సలహాల మేరకు జిల్లా అభివృద్ధికి పాటు పడతామని తెలిపారు.

దోమల నివారణ చర్యలు

నల్లచెరువు : స్థానిక విజయలక్ష్మి కాలనీలో ఇటీవల జ్వరంతో 12 నెలల చిన్నారి మృతి చెందింది. దీంతో వైద్యాధికారులు స్పందించారు. నల్లచెరువు పిహెచ్‌సి సిహెచ్ఒ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కాలనీలో మురుగనీరు, నీటి నిల్వలు, డ్రెయినేజీ కాలువల్లో దోమల నివారణకు అబేట్ స్ప్రే చేయించారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రుణభారంతో ఓ కౌలురైతు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్న సంఘటన మండల పరిధిలోని వడ్డేపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని వడ్డేపల్లికి చెందిన పసుపుల సోమశేఖర్ (26) నాలుగుఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పంటసాగుకు, కుటుంబపోషణకు సోమశేఖర్ అప్పులు చేశాడు. ఇలా దాదాపు 12 లక్షల దాకా అప్పులు చేశాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనోవ్యధకు గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య శ్యామల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణం శాంతినగర్‌కు చెందిన కొండప్ప (47) అనే వ్యక్తి సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుటుంబసభ్యులు తెలిపారు. కొండప్ప కూలి మగ్గం నేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. మృతునికి భార్య వరలక్ష్మి, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కొండప్ప ఆత్మహత్యకు గల కారణాలు తమ దర్యాప్తులో తేలాల్సుందని రెండవ పట్టణ పోలీసులు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

హిందూపురం రూరల్ : మండలంలోని సంతేబిదనూరు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ధర్మవరం రూరల్ : రైలు ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన వెంకటలక్ష్మికి మతిస్థిమితం సరిగాలేదు. ఆమె పట్టణంలోకి వెళ్తుండగా గాంధీనగర్ రైల్వే గేట్ వద్ద ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వృద్ధురాలిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో హల్‌చల్.. కేసు నమోదు

కదిరి అర్బన్ : పట్టణంలోని థాయి గ్రాండ్ హోటల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఓ యువతి, యువకుడు మద్యం మత్తులో స్థానికులతో గొడవ పడినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సర్ది చెప్పేందుకు వెళ్లిన పోలీ సుల పట్ల కూడా వారు దురుసుగా ప్రవర్తించారని తెలిపారు. వారిని చక్రాయపేటకు చెందిన లోకేష్, బి.కొత్తకోటకు చెందిన షేక్‌బానుగా గుర్తించామన్నారు. వారికి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా అతిగా మద్యం తాగినట్లు తేలిందని, వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాకాల పోలీస్‌స్టేషన్‌లో కదిరి చిన్నారులు

కదిరి అర్బన్ : పట్టణంలోని ఖాద్రీశుని ఆలయ సమీపంలోని కుమ్మర వీధికి చెందిన అరుణ్, తరుణ్ అనే చిన్నారులు పాకాల పోలీస్‌స్టేషన్‌లో ఉన్నట్లు కదిరి పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. ఈ ఇద్దరు చిన్నారులు పాకాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉండగా అక్కడి పోలీసులు చేరదీసి స్టేషన్‌కు తీసుకెళ్లి ఆరా తీయగా తమ తల్లిదండ్రులు మోహన్‌రాజ్, శ్రీలక్ష్మి అని, కదిరిలో ఖాద్రీశుని ఆలయ సమీపంలోని కుమ్మర వీధిలో నివాసం ఉంటున్నట్లు తెలిపారన్నారు. అయితే వారు ఫోన్ నెంబర్లు చెప్పలేక పోతున్నారని తెలిపారు. పిల్లలను గుర్తిస్తే పాకాల పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నరేష్–97016 85907, లేదా కదిరి టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సిఐ కోరారు.

పాకాల స్టేషన్‌లో ఉన్న చిన్నారులు

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చూపకుండా వేగవంతంగా సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 237 అర్జీలు రాగా వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కానీ అర్జీదారులు నేరుగా కలెక్టరేట్ కు వస్తున్నారన్నారు. కలెక్టరేట్లో తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో నమ్మకంతో వ్యయ ప్రయాసలు కోర్చి వస్తుంటారన్నారు. అలాంటి వారి సమస్యలను నిర్ణీత గడువులోగా క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలన్నారు.

ఉత్తమ క్లాప్ మిత్ర దొడ్డప్పకు సన్మానం

స్వచ్ఛఆంధ్ర 2025లో భాగంగా కదిరి మండలం బురగపల్లి గ్రామపంచాయతీలో క్లాప్ మిత్రగా పనిచేస్తున్న దొడ్డప్పకు రాష్ట్రస్థాయి ఉత్తమ క్లాప్ మిత్ర అవార్డు రావడం పట్ల కలెక్టర్ అభినందించారు. ఈ మేరకు దొడ్డప్పకు అవార్డు ప్రదానం చేసి శాలువా, పూలమాలతో సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దొడ్డప్ప పలువురికి ఆదర్శంగా నిలిచారని ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వై. సమత, కదిరి ఎంపీడీవో పోలప్ప, బురగపల్లి సర్పంచి భాస్కర్, పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు పరికరాలు పంపిణీ

జిల్లాలోని పలువురు వికలాంగులకు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పరికరాలను కలెక్టర్ అందజేశారు. సోమవారం కలెక్టరేట్ లో డిగ్రీ, బిటెక్ ఉన్నత చదువులు చదువుకునే ఇద్దరు వికలాంగులకు 2 ల్యాప్ టాప్‌లు, 10 మంది బధిరులకు 10 టచ్ ఫోన్లు, ఒక దివ్యాంగురాలికి వీల్ చైర్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, వికలాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు, జి. అర్చన తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ - 2025లో మున్సిపల్ పాఠశాలలకు అన్యాయం

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ- 2025 మున్సిపల్ పాఠశాలలకు తీవ్ర నిరాశను మిగిల్చిందని మున్సిపల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. పోస్టుల కేటాయింపులో మున్సిపల్ పాఠశాలలకు అన్యాయం జరిగిందని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, పురపాలక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం వల్ల అధిక సంఖ్యలో మోడల్ ప్రైమరీ పాఠశాలలుగాను, ఉన్నత పాఠశాలలుగాను ఉన్నతీకరించబడ్డాయని తెలిపారు. ఉన్నతీకరించబడిన పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. డీఎస్సీలో నూతన ఉపాధ్యాయులు వస్తారని ఎంతో ఆశగా ఎదురు చూసినప్పటికీ చివరికి ఆశ ఎండమావిగానే మిగిలిందన్నారు. కేవలం హిందూపురం పురపాలక సంఘంలో ఉర్దూ విభాగంలో ముగ్గురు ఎస్జీటీలు, తెలుగు విభాగంలో ఐదుగురు ఎస్జీటీలు మాత్రమే నియమించబడ్డారని, మిగిలిన ఉన్నత పాఠశాలలకు ఒక్క పోస్టు కూడా రాకపోవడం ఆందోళన కలిగించిందని వాపోయారు. అదేవిధంగా ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్ల నియామకానికి సాధ్యమైనంత త్వరలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పాఠశాలల్లో విద్యార్థుల భవిష్యత్తుకు దోహదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ ఫెడరేషన్ హిందూపురం శాఖ అధ్యక్షులు మహమ్మద్ అన్సర్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, బాలకష్ణ, శివ గంగిరెడ్డి, జిల్లా కార్యదర్శి జనార్ధన్లు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఎంటీఎఫ్ నాయకులు

చేనేతలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

చేనేతల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని చేనేత ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం చేనేత ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా పథకం, చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రభుత్వ హామీ సత్వరమే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కొరకు మార్చి నెలలో క్యాబినెట్ ఆమోదించి విడుదల చేసినప్పటికీ అమలుకు నోచుకోలేదని వాపోయారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంవత్సరానికి రూ.25 వేలు అందించే నేతన్న భరోసా పథకం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ వీలైనంత త్వరగా సంబంధిత మంత్రితో సంప్రదించి చేనేతలకు ఇచ్చిన హామీ నెరవేరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక సభ్యులు దేవరాజు, బాబు, సుభద్ర భాయ్, అశ్వర్థమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలయ్యకు వినతిని ఇస్తున్న చేనేత కార్మికులు

తేజస్వినిని అభినందిస్తున్న నాయకులు

ఆర్చరీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా తేజస్విని

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ రెండో కుమార్తె తేజస్విని రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విశాఖపట్నంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ సమావేశంలో తేజస్వినిని అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అనంతరం అనంతపురం ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ, కార్యదర్శి శివకుమార్, నళినిలు తేజస్వినికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తేజస్విని రాష్ట్ర ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్షురాలిగా ఎంపిక కావడం పట్ల శ్రీ సత్యసాయి జిల్లా ఆర్చరీ కోచ్ జనార్ధన్ రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు.

విద్యతో సమాజాభివృద్ధి : ఎమ్మెల్యే

అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం

విద్య ద్వారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. నియోజకవర్గ పర్యటన లో భాగంగా సోమవారం కిరికెర పంచాయతీ, హిందూపురం పట్టణంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. బసవనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోఅదనపు గదులు, బి.టి. రోడ్డు ను ప్రారంభించారు. అదే విధంగా బసవనపల్లి నుండి భరత్ నగర్ వరకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.1కోటితో నూతనంగా వేసిన బీటీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం హిందూపురం పట్టణంలో కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ భావి తరాల భవిష్యత్తుకు విద్య కీలకమన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకుని సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీ సోమవారం సాయంత్రం వాణిజ్య పనుల శాఖ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ పై ర్యాలీ నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుండి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ బజార్ మీదుగా ఎన్టీఆర్ కూడలి వరకు సాగింది. ఈ కార్యక్రమంలో స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో పాటు జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున, డిఎంసి గంగులయ్య, కూటమి నాయకులతో పాటు కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నిషితను అభినందిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

టాలెంట్ టెస్ట్‌లో 'పాంచజన్య' చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో యూకేజీ చదువుతున్న చిన్నారి ఎన్.ఆర్. నిషిత టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. జాన్సన్ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఎంసిఆర్ ఇన్స్టిట్యూట్ లో జరిగిన టాలెంట్ టెస్టు పద్య పోటీల్లో నిషిత రాణించి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రం, షీల్డ్ పొందినట్లు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం చిన్నారిని శ్రీనివాసులుతో పాటు కరెస్పాండెంట్ నందకుమార్, ప్రధానోపాధ్యాయులు గాయత్రి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గాదేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం, రోజు ప్రత్యేక అలంకరణలతో అమ్మవారిని పూజించడం ఎంతో సంతోషంగా ఉందని అందరూ కలసి ఆలయ అభివృద్ధికి కృషి చేద్దామని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. సోమవారం సాయంత్రం హిందూపురం ఎమ్మెల్యే నివాసంలో లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దసరా ఉత్సవాలు విజయవంతం చేయడం పట్ల రమానందన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. మరికొద్ది నెలల్లో జరిగే లేపాక్షి ఉత్సవాలు దేశంలోనే గుర్తింపు పొందే విధంగా జరుగుతాయని, వాటి ఏర్పాట్లు ప్రణాళికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని మంగళకర కళాశాలలో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో శక్తి యాప్, సైబర్ నేరాలు, డ్రగ్స్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో, ఈవ్ టీజింగ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు నారాయణమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులపై డిప్యూటీ డిఇఒ విచారణ

గాండ్లపెంట : మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని డిఇఒకు అందిన ఫిర్యాదుల మేరకు డిప్యూటీ డిఇఒ జాన్‌రెడ్డప్ప ఆయా పాఠశాలలకు వెళ్లి విచారణ చేపట్టారు. ఆయన సోమవారం మండలంలోని ప్రైవేటు పాఠశాల, ఆదర్శ పాఠశాల, జిసిఆర్ కేరళ మోడల్ శాంతినికేతన్, అక్షర పాఠశాలలను సందర్శించి పాఠశాలల రికార్డులు, ఫీజుల పట్టికపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల తో సమావేశం నిర్వహించి పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యాలు పాఠశాల నోటీసు బోర్డులో తరగతుల వారీగా ఫీజుల పట్టిక తప్పనిసరిగా వేయాలని, లేనిచో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఇఒ బి.కృష్ణానాయక్, పాఠశాల యజమానులు ఉన్నారు.